

# యాదృచ్ఛికం

**శ్యామలతాదేవి** చేజారి కిందపడి ముక్కలై చెల్లాచెదరైన అద్దంపెంకులు ఓపికగా కూర్చొని ఏరసాగింది!

తలుపు పక్కగా పడి ఉన్న ఫ్రేములో ఇంకా ఇరుక్కొని ఉన్న అయిదారు ముక్కలు జాలిగా దీనంగా ఆమె ముఖంలోకి చూస్తున్నాయి.

శ్యామలతాదేవి కంటిలో నీరు గిర్రున తిరిగింది.

అవును అద్దం పగిలి ముక్కలయింది.

దాని స్థానంలో మరొకటి తెచ్చుకోవటం బహుతేలిక.

కాని...కాని...తన ముఖం...స్ఫోటకం మచ్చలతో నిండిన తన ముఖం....అందులోను ఒకనాడు అత్యంత సౌందర్యవంతంగా తెలిగిన తనముఖం!

రెండు చేతులతోను ముఖాన్ని కప్పుకొని తన గదిలోకి పరిగెత్తుకుంటూ వెళ్ళి దిండులో తలదూర్చి వెక్కివెక్కి ఏడవసాగింది,

రూపాన్నే కోల్పోయిన తన ముఖం స్థానంలో మరో ముఖం తెచ్చుకోవటం సాధ్యమేనా?

ఊహూఁ. ఎన్నటికీ కాదు. తన భావిజీవితమంతా ఈ అందవిహీనమైన ముఖంతోనే గడిచిపోవలిసిందే. దానినెవరూ ఇక మార్చలేరు.

అద్దం పగిలింది!

ఎందుకో ఆ మాట అనుకున్నప్పుడల్లా ఎక్కువ ఏడుపువస్తోంది.

ఆ అద్దం బావ బొంబాయి ట్రెయినింగ్‌కు వెళ్లబోయేముందు కొని ఇచ్చింది.

ఇక రేపు వెళతాడనగా, "ప్రతిక్షణం నీవు నా కళ్లల్లోనే మెదులుతూంటావు, బావా. నిన్ను వదిలి ఈ ఆరునెలలు ఏలా గడపాలో నాకు అర్థంకావటం లేదు. నాకు దిగులు వేస్తోంది! భయం వేస్తోంది!" అన్నది.

నవ్వాడు.

వెన్నెల్లా నవ్వాడు.

"సరే, పద! నే నో ఉపాయం ఆలోచించాను!" అన్నాడు.

ఎక్కడికో అనుకున్నది తను.

బజారుకు తీసుకువెళ్లాడు.

అందమైన ఈ అద్దంకొని తన చేతికి ఇస్తూ, "ప్రతిక్షణం నీ కళ్లల్లో మెదిలే నన్ను ఈ అద్దంలో చూచుకుంటూ ఈ ఆరునెలలూ గడిపెయ్యి, శ్యామా! తరవాత ఏలాగా నిన్ను ఒక్కక్షణం వదిలి ఉండను!" అన్నాడు.

ఆ రోజుల్లా తను నవ్వలేక చచ్చింది.

కాని,

ఆ అద్దం పగిలిపోయింది తన ముఖంలా!

కిందనుండి శ్యామలతాదేవి తల్లి పిలిచింది.

ఇక తప్పక మూడవ పిలుపుతో కిందికి వచ్చింది.

"అయితే కళ్లు ఎర్రబడి ముఖం ఉబ్బిందేం? పైన కూర్చొని ఏడుస్తున్నావా?"

ముఖం పక్కకు తిప్పుకొని అన్నది: "అద్దం పగిలిందమ్మా!"

"దానికా ఏడుపు? ఇంకొకటి తెచ్చుకుందాంలే!"

తన బాధ ఆమెకు ఏలా అర్థమవుతుంది? తన వేదనను ఆమెముందు ఏలా వెళ్లగక్కగలదు?

"ఇదుగో, ఏదో ఉత్తరం వచ్చింది! చదువు!"

ఆత్రంగా కళ్లు రెపరెపలాడించింది. దడదడలాడే గుండె చిక్కబట్టుకొని ఆ ఉత్తరం చేతిలోకి తీసుకుంది.

తనకు తెలుసు దానిని చూడకముందే, అది తన బావ వ్రాశాడని, అత్యంత కుతూహలంతో తన రాక తెలియబరుస్తూ వ్రాస్తున్నాడని.

"శ్యామా!

నిన్ను ఆత్రంగా వీక్షించాలనే నా కళ్లకు నీ దర్శనం సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు స్టేషన్‌లోనే కలిగిస్తావుగదూ?

ఏమో రాణీగారి దయ!

ఇట్లు
నీ బావ
శేఖరం."

ఆ రెండు మాటలూ చదువుతూంటే ఆమె చెంపలు కెంపులయ్యాయి. వడివడిగా తల్లి పిలుపు కూడా వినకుండా పైకి పరిగెత్తింది.

"సోమవారం ఉదయం రేపే!"


గదిలోకి వచ్చి తలుపులు బంధించి వెనుదిరిగిచూస్తే బల్లమీద పెట్టిన పగిలిన అద్దం ఆనందానికి అపశ్రుతిలా కిసుక్కుమన్నది. హృదయంలో ముల్లులా గుచ్చుకున్నది.

మచ్చలు పడిన ముఖం నల్లగా మారిపోయింది.

భయం భయంగా దానివైపే అడుగులు వేసింది.

తన ముఖం...ఆ తన ముఖం...తనదేనా అది? అందహీనంగా, వికృతంగా పగిలి ముక్కలయినట్లుగా ఉన్నది. చేతిలో బావ ఉత్తరం కూడా చిరిగి ముక్కలైనట్లున్నది!

భగవాన్! ఈ ముఖాన్ని రేపు బావ కెలా చూపిం






# యాదృచ్ఛికం

చడం?

ఇన్నాళ్ళ ఈ విషయాన్ని భయంతో ఉత్తరంలో వ్రాయకుండా తప్పించుకుంది గాని, రేపు ఉదయాన్నో?

అందానికి ప్రతిబింబంలా వెలిగిన తన ముఖాన్ని చూడాలని వచ్చే బావకు ఈ ముఖంతో దర్శనం ఏలా ఇవ్వగలదు?

మంచంమీదుపడి ఎన్ని గంటలో ఆలా గడిపింది

అకస్మాత్తుగా తిరిగి రోజూ గుర్తుకువచ్చే రుక్మిణి గుర్తుకు వచ్చింది.

నిజంగా ఆమె జీవితం శోచనీయమే.

గులాబీలా అందంగా మెరిసిపోతూ ఉండేది. ఆమె అందానికి మైమరిచిపోయే మధును ప్రేమించింది. పెండ్లి చేసుకున్నది.

కాని, ఏమయింది?

తరవాత ఆరునెలలు తిరక్కముందే తన ముఖం లాగానే ఆమె ముఖమూ అయింది.

అత్యధికంగా ప్రేమించే మధు, ఒక్క క్షణమైనా విడిచి ఉండలేని మధు ఆమె కనబడితేనే విసుక్కునేవాడు. ఈసడించుకునేవాడు. ఆమెను వెంట తీసుకు వెళ్లటం తన ఆఫీసరు హోదాకే అవమానం అనేవాడు.

భరించలేకపోయింది. ఏడ్చింది. కళ్ళు కాయలు కాచేలా ఏడ్చింది. చివరికి ఒకరోజు రాత్రి ఒంటిమీద కిరసనాయిల్ పోసుకొని నిప్పు లంటించుకుంది.

భగవాన్!

తన బావ తననూ ఆలాగే చూస్తాడా?

ఏమో? మగవాళ్లంతా ఒకటేగా?

అంతేనా?

కాదేమో?

ఎందుకనుకోవాలి ఆలా? తన అందాన్ని చూచేకాక, తన హృదయాన్నే ప్రేమిస్తున్నాడేమో బావ? బావ హృదయం తనకు బాగా తెలుసు తన ముఖం ఎలా ఉన్నా తనని ప్రేమిస్తాడని, పూర్వంలాగానే తనను ఆదరిస్తాడనేది నిస్సందేహం!

అంతదాకా ఎందుకు?

ఆరోజు...

తనకు బాగా గుర్తుంది, నిజం. అది గుర్తుకు వస్తూంటే తన బావ హృదయం ఏలాంటిదో అవగతమవుతూంది. అతణ్ణి గురించి తను భయపడవలసిన అవసరం లేదనిపిస్తూంది, తన పిచ్చి అపోహలు తప్ప.

ఆరోజు ఇద్దరూ సినిమాకు వెడదామని బయలుదేరారు.

ఇంకా వ్యవధి ఉండడంతో నడిచి వెడదామన్నాడు బావ. సరేనన్నది. ఇద్దరూ రోడ్డుపక్కగా ఉన్న పేవ్మెంటుమీద జనాన్ని చూస్తూ నడవసాగారు.

అకస్మాత్తుగా ముందు నడుస్తున్న ఒక జంటను చూచి తను కిసుక్కున నవ్వింది.

ఆరోజుల్లో తన అందాన్ని చూచుకొని తానే గర్వపడుతూండేది. అందుకనే ఈరోజు భగవంతుడు ఇలా శాస్తి చేశాడు.

**ఆమితమైన దుఃఖంలోను, సుఖంలోను కూడా మనిషి అంతర్ముఖుడు అవుతాడు, సర్వసాధారణంగా. ఆ స్థితిలో ఒక పట్టాన ఇతరులమీదికి దృష్టి మరలదు మరలినా సానుభూతి లోపిస్తుంది. ఇతరుల సుఖదుఃఖాలు హృదయాన్ని ఆలాంటి స్థితిలోనూ కదల్చ గలిగిననాడు మనిషి ఉన్నతుడు అవుతాడు.**

---

బావ తనవైపు తిరిగి, "ఏమిటి, శ్యామా, నవ్వుతున్నావు?" అన్నాడు.

తను ముందు నడుస్తున్న దంపతులను చూపించింది.

ఆమె వెనకనుండి చూచినా కూడా ఎంతో అందంగా మెరిసిపోతున్నది. కాని, ఒక కాలు అవిటి కావటంతో కుంటుతున్నది. నడుస్తూంటే ఎగిరెగిరి పడుతున్నట్లున్నది.

అప్పుడు తన బావ ఏమన్నాడు?

"అలా నవ్వకూడదు, శ్యామా! జాలిచెందాలి. పాపం భగవంతుడు విధించిన ఆ శిక్షకు ఆమె లోలోపల ఎంత బాధపడుతున్నదో!"

టక్కున తన నవ్వు ఆపి ముఖం దించుకున్నది.

తన బావది నిజంగా అద్భుత హృదయం.

"అంతేకాదు, శ్యామా! నేను హృదయపూర్వకంగా లతణ్ణి అభినందిస్తున్నాను కూడా. మనిషి అందాన్ని చూచి పెండ్లి చేసుకునేదానికంటే, హృదయంచూచి, మనస్సు అర్థంచేసుకొని వివాహం చేసుకుంటేనే, శరీరంలో ఎన్నిలోపాలున్నా, జీవితం అత్యంత సుఖవంతంగా, ఆనందోల్లాసంతో గడిచిపోతుంది!"

ఎంత చక్కగా చెప్పాడు!

ఆ సంఘటన గుర్తుకు వచ్చిన తరవాత ఆమె హృదయం సంపూర్ణంగా తేలికపడింది.

కాని....

మరో ఆలోచన...మరో సంఘటన...

మనస్సు తల్లడిల్లి పోతూంది. మనస్సుకు స్థిమితమే దూరమైపోతూంది.

రాత్రి పన్నెండుగంటల సమయంలో తన గదిలో ఒంటరిగా పడుకొని, దిండులో తల దూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది.

• • •

ఉదయం పగిలిన మబ్బులలోనుండి సూర్యుడు బయటపడుతున్నాడు.

శ్యామలతాదేవి నిద్రలేమి సూచించే కళ్లలో ఆరు గంటలకే లేచింది:

మౌనంగా, నిర్లిప్తంగా స్నానంచేసి బట్టలు మార్చుకొని కాఫీ తాగింది.

పాత ఆలోచనలలో కొత్త ఆనందం. ఆనందంలో వేదన.

తను కొద్ది గంటల్లో తనను హృదయ పూర్వకంగా ప్రేమించే బావ ఎదట ఉండబోతున్నది. కాని అతడికి తెలిసిన ముఖంతో కాదు! మరోముఖంతో.. .పగిలిన వికృతమైన ముఖంతో....నిర్జీవమైన ముఖంతో... లందహీనమైన ముఖంతో... అంతదాకా ఎందుకు? అసహ్యమైన ముఖంతో!

తన గదిలోకి వచ్చి పగిలిన అద్దంలోకి, కన్నీటిని ఆపుకో ప్రయత్నిస్తూ చూచింది. గుంటలుపడిన ముఖం, అద్దంముక్కల్లా పగిలి వికృతంగా, ఎగుడు దిగుడుగా, భయంకరంగా కనిపిస్తూంది.

అలాగే అద్దంలోకే చూస్తూ దువ్వెన తీసుకొని తల దువ్వుకోసాగింది, వంకరటింకరగా కనబడుతున్నా.

ఆ అద్దాన్ని నిర్లక్ష్యం చెయ్యకుండా ఉంటే తననూ బావ నిర్లక్ష్యం చెయ్యడని తెలియని ఆశ.

భావి జీవితాన్ని గురించి భగవంతుడు తన నుదుట ఏమి వ్రాశాడో?

చేతి గడియారం చూచుకుంది.

ఇంకా రైలు వచ్చేందుకు గంట వ్యవధి ఉన్నది.

తల దువ్వుకోవటం పూర్తి అయ్యేటప్పటికి శ్యామ లతాదేవి తల్లి టిఫిన్ తయారుచేసి తెచ్చింది.

తను స్నోబాటిల్ చేతిలోకి తీసుకుంది.

మళ్లీ నెలరోజుల తరువాత అకస్మాత్తుగా చెయ్యి ఆ సీసామీదపడింది.

స్నోతో గుంటలు కనబడకుండా పూడ్చుకోగలదా?

అదే ముఖాన్ని మరింత వికృతంగా చెయ్యదుగదా?

దూమెరుగ్గా రాసుకుంది. పౌడరు అద్దుకుంది. క్షణం ముఖం వికృతంగా లేదేమోననిపించింది. పగిలిన అద్దాన్ని చేతిలోకి తీసుకొని ముఖందగ్గిరగా పెట్టుకొని చూచుకుంది. ఎంత స్నో, ఎంత పౌడరు పూసుకుంటే మాత్రం ఎక్కడికి పోతాయి అవి?

ఎందుకు ఈ బాధంతా? జరగవలసినదేదో జరిగి తీరుతుంది. తను ఎంత భయపడ్డా, వేదన చెందినా దానినుండి తప్పించుకోలేదు. అటువంటప్పుడు ఎందుకు ఈ ఆత్మక్షోభ?

ముఖాన కుంకుమ పెట్టుకొని పగిలిన అద్దంలోకి మరోసారి వద్దనుకుంటూనే చూచుకొని భారంగా బయట కాలు పెట్టింది.

తన బావ!

నిజంగా అంత అందగాడైన తన బావకు తను తగనేమో?

ఇంజనీరు అయిన తన బావవెంట తను తిరగటం తనను తాను చిన్నబుచ్చుకోవటమేగాకుండా, అతడినీ చిన్నబుచ్చినట్లు అవుతుందేమో? పొద్దుటినించి ఆఫీసర్ల నడుమ తిరిగే అతడికి ఒక అందవికారమైన భార్య ఉన్నదని తెలిస్తే ఎంతగా హేళనలకు గురి అవుతాడో గదా?

ఈ జీవితంలో తనకిక ఆనందం లేదు.

అటువంటప్పుడు అతడికీ ఆ ఆనందాన్ని ఎందుకు కరువుచెయ్యాలి?

తనని వివాహం చేసుకోవద్దని చెప్పేస్తే?

గుండె గుభేలుమంది.

అమ్మో! తను బావను విడిచి ఒక్క క్షణమైనా ఉండగలదా?

అయితే స్వార్థంకోసం అతడికి కూడా అన్యాయం చెయ్యాలా?

ఏమో బాబూ? ఈ సమస్య ఏలా తెగగొట్టాలో తనకేమీ పాలుపోవడంలేదు.

తానేం చెయ్యాలి?

అసలు ముందుగానే...ఏది అయితే అది అవుతుందని

---

## పి. ఎస్. నారాయణ

---

జాబు వ్రాయవలసింది.

కంటివెంట నీరు ఎంత ఆపుగుందామనుకున్నా ఉబికి ఉబికి వస్తూంది.

రిక్షాలో కూర్చున్న ఆమెకు స్టేషన్ దగ్గిర అవుతున్న కొద్ది గుండె దడదడ ఎక్కువ కాసాగింది. తనేదో భయంకర ప్రదేశానికి ప్రతిక్షణం దగ్గిర అవుతున్నట్లుగా వణికిపోసాగింది.

ఎలా ఈ సంఘటన ఎదుర్కోవటం?

ఎలా బావకు ఈ ముఖం చూపటం?

ఆమెకు పాలుపోలేదు. ఎంత గుండె దిటవుతో ఉన్నా ప్రతిక్షణం ఆమె యమయాతన అనుభవించసాగింది.

తన బావ కళ్లఎదట తను ఎలా నిలబడటం?

ఆమెను మరింత కల్లోలపరుస్తూ, స్టేషన్‌ముందు రిక్షా దిగుతూండగానే, స్టేషన్‌లోకి రైలువచ్చి ఆగింది, తన బావను తీసుకువచ్చి

ఆమె గుండె గుబగుబలాడింది.

కాళ్లు తడబడ్డాయి.

మనిషి నీరసంతో వణికిపోయింది.

తన భావిజీవితానికి సౌఖ్యమో, దుఃఖమో తేల్చివేసే సంఘటన కొద్దిక్షణాల్లో జరగబోతూంది.

"భగవాన్!"

పరిగెడుతున్నట్లుగా, తూలిపడుతున్నట్లుగా కౌంటర్‌వద్దకు పరిగెత్తి ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొని తడబడుతూ, ఎదురుగా వచ్చే మనుష్యుల్ని తప్పుకుంటూ గేటు దాటి లోపల కాలు పెట్టింది.

ఏ పెట్టెముందు తనకోసరం ఆత్రంగా నిలబడి వేయికన్నులతో ఎదురు చూస్తున్నాడో తన బావ!

తనను చూచి, తన ముఖం చూచి తనతో మాట్లాడనైనా మాట్లాడతాడా?

ఏమో?

ఆలోచనలు అల్లకల్లోలంగా చుట్టుముట్టగా నిర్జీవంగా ఒక్కొక్కపెట్టె చూచుకుంటూ ముందుకు నడవసాగింది.

బండివచ్చి అయిదు నిమిషాలయినా ఇంకా దిగలేదా? రాలేదేమో?

ఆమాట అనుకోగానే అలా జరిగితేనే ఎంతో బాగుండుననిపించింది.

తను ఈ ముఖంతో బావఎదట నిలబడలేదు.

ఈరోజుగనక రాకపోతే వెంటనే ఒక జాబు నిజమయిన తన ముఖాన్ని ప్రతిబింబిస్తూ వ్రాసి వేస్తుంది బావకు దానిమీదే తనను ఆదరించేది, నిరాదరించేది నిర్ణయం చేసుకుంటాడు తన బావ

అప్పుడు ఇంత క్షోభ పడకుండానే తన భావిజీవిత నిర్ణయం జరిగిపోతుంది.

ఎందుకు వేదనలో మరింత వేదన?

(తరువాయి 62 వ పేజీలో)

# ఆంధ్రప్రభ

## సచిత్ర వారపత్రిక

**1965, నవంబరు 1 నుంచి**

**కొత్త ప్రకటన రేట్లు**

**క్యాజువల్ :** కాలం సెం. మీ. 1 కి 7—50

**కంట్రాక్టు:** కాలం సెం. మీ. 1 కి రు. 6-80

(250 సెం. మీ. లు, ఆపైన)

(ప్రకటనకు కనీస స్థలం సిం. కాలం—5 సెం. మీ. లు)

**అట్ట పేజీలు**

**4 వ పేజీ-రెండు రంగులు**

**క్యాజువల్ :** ప్రకటన 1 కి రు. 1100/—

**కంట్రాక్టు :** ప్రకటన 1 కి రు. 950/—

(కనీసం 6 ప్రకటనలు)

**2 వ పేజీ, 3 వ పేజీ—**

ఒక రంగు

**క్యాజువల్ :** ప్రకటన 1 కి రు. 700/—

**కంట్రాక్టు :** ప్రకటన 1 కి రు. 600/—

(కనీసం 6 ప్రకటనలు)

**కొలతలు :**

కాలం వెడల్పు 5 సెం. మీ.

కాలం పొడవు 23 సెం. మీ.

పేజీకి 3 కాలంలు

*ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:*

**అడ్వర్టయిజ్‌మెంట్ మానేజర్,**

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**

**ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు- 2**


# ఉత్తరాలు

'మిథ్యాబింబాలు' మాత్రం చాలా విస్తారంగా నడిచిపోతున్నది. కథ పాఠకులు అనుకోని విధంగా నడిపించటంలో రచయిత చూపిన నేర్పు ప్రశంసా పాత్రమైనది.

—ముంగర లలితకుమార్
(హైదరాబాదు)

* * *

'ప్రేమనగర్' చాలా బాగుంది. ప్రేమనగర్ నిర్వహణం రచయిత్రిగారి కవితాశైలికి ఒక మెట్టు లాయి. 8—12—65 వ తేదీ సంచికలో లతపాత్ర పాఠకుని హృదయాన్ని కరిగించి కన్నీటి చుక్కలు రాల్చుకోగలిగింది అంటే అతిశయోక్తి కాదు.

—బి. కృష్ణమూర్తి
(బల్హార్‌షా)

* * * *

'ప్రేమనగర్' నవల కౌసల్యాదేవిగారి నవలల్లో మాస్టర్‌పీస్ అని చెప్పటం అతిశయోక్తి కాదేమో.

# యాదృచ్ఛికం

(39 వ పేజీ తరువాయి)

బండి కదిలేవరకూ చెప్పినా తన బావ జాడలేదు.

ఆమెను నిరాశ ఆవరించింది. గుండెలో బరువు తగ్గింది. ఇందాకటినుంచి పేరుకుపోయిన భయమూ, భారమూ ఏదో తొలగించినట్లని పించింది. ఎప్పటికైనా అసహ్యమైన పెళ్ళిలో బందీ కాకుండా ఉండటమే ఎంతో హాయిగా ఉంది!

తిరిగి వెళ్ళిపోయిన అనుమానం మనస్సులో తీవ్రంగా మెదలగా ఒక్కొక్క పెట్టె చూస్తుంటూ వెతికిగి నడకసాగించింది.

తలుపు దగ్గరగా వేసి ఉన్న రెండవ తరగతి పెట్టె దగ్గరకు వచ్చి కిటికీలోనుంచి తొంగిచూసి ఉక్కిరి బిక్కిరి అయింది.

లోపల తల వంచుకొని కూర్చొని ఉన్నాడు శేఖర్!

ఉద్విగ్నహృదయంతో, సర్వం మరిచిపోయి తలుపు తీసుకొని ఒక్క ఉదుటున లోపలికి వెళ్ళింది.

"ఇదేమిటి, బావా! బండి ఆగి పదినిమిషాలైనా అలా కూర్చొనే ఉన్నావు?"

"శ్యామా! నీవు వస్తావని నాకు తెలుసు. కానీ నీవు రాకముందే నేనెలా దిగేది? నీకు తెలియదు శ్యామా! నీ ఆసరా ప్రతిక్షణం నాకు కావాలి! నిన్ను నేనింతవరకూ మోసం చేసినందుకు నా హృదయం సిగ్గుతో కుంచించుకుపోతుంది, శ్యామా! నేను నీకు ఆ విషయం జాబు వ్రాయలేకపోయాను. ఆదరించినా, చీదరించినా ఈ క్షణంనుండీ ఒక ప్రమాదంలో కుడి కాలు పోగొట్టుకున్న నీ బావకు నీవే దిక్కు, శ్యామా!"

సమాధానంకోసం చటుక్కున తలఎత్తాడు శేఖరం! ★

ముఖ్యంగా లత పాత్రచిత్రణ చదువరుల మనస్సులను ఆకర్షించిందనే చెప్పాలి. ప్రేమమూర్తి కల్యాణ్ పాత్ర కూడా అలాంటిదే. ముగింపు ఎంతో చక్కగా ఉంది. ముగింపులో వారి భాష సుమధురమై నా మనస్సును ఎంతో రంజింపజేసింది.

—కె. ఎల్. ఎన్. శర్మ
(పెనుకొండ)

• • •

కౌసల్యాదేవిగారి 'ప్రేమనగర్' సీరియల్ ఎంతో బాగుంది. ముఖ్యంగా లత బాధలు చాలా వాస్తవికంగా సృష్టించారు రచయిత్రి. ఆమెకు నా ధన్యవాదాలు.

—యేసురత్నం
(బాపట్ల)

• • •

రాగద్వేషాలకు శాశ్వతంగా లభించిన విరాగం పూర్వరంగంలో సమాప్తమైన 'ప్రేమనగర్' చదవటానికి ఆసక్తిదాయకంగా ఉంది. లత, కల్యాణ్ పాత్రపోషణలో తగు మెలకువతో వ్యవహరించిన రచయిత్రికి అభినందనలు చెప్పక తప్పదు పాఠక లోకం. "ఆశాభంగం పొందిన నరుని ఎదలో ఆవేదన తల ఎత్తుతుంది" అన్న కల్యాణ్ మాటలు చూస్తే ఎంతో జాలి వేస్తుంది. "అనాయాసద్వేషాలకూ, అర్థ రహితమైన కట్టుబాట్లకూ ఇక్కడ స్థానం లే"దని 'ప్రేమనగర్'ను గూర్చి, అందులోనూ కల్యాణ్ చేత చెప్పించటం అంత సమంజసంగా లేదని చెప్పాలి.

'మిథ్యాబింబాలు'లో సారథి పాత్ర 15—12—65 వ తేదీ సంచికవరకూ బాగానే ఉంది.

—ఎన్. ఆర్. కె. శర్మ
(హైదరాబాదు)

• • •

'ప్రేమనగర్' సీరియల్ చాలా బాగున్నది. రచయిత్రి శ్రీమతి కౌసల్యాదేవిగారికి, అటువంటి గొప్ప రచనా ఫలితములు అందజేస్తున్న మీకు నా ధన్యవాదాలు.

—ఎమ్. విశ్వేశ్వరరావు,
స్వామి దయానన్ద,
అట్లు సాహిత్రి
(టాటానగర్—24 పరగణాలు)

• • •

శ్రీమతి కౌసల్యాదేవిగారి 'ప్రేమనగర్' నవల పాఠకులు ఆదరించినట్లు లేదు. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లా నడిచింది కథ. కొన్ని సంఘటనలు ఇంకా విపులంగా వ్రాస్తే బాగుండును.

—శీలం శివసత్యయ్య
(ఉప్పలపల్లి)

• • •

పాలు పోసి పెంచిన పాములు కాటెయ్యక మానవు. పవిత్రప్రేమ ఓటమి చెందదు అని నిరూపించిన 'ప్రేమనగర్' నవల నన్నెంతో ఆనందపరిచింది.

మంచి నవలలు వ్రాయగలనని నిరూపించుకుంటున్న శ్రీమతి కౌసల్యాదేవిగారికి ధన్యవాదాలు. పాఠకులకు మంచి నవలలు అందిస్తున్న సంపాదక మహాశయులకు ప్రత్యేక అభివందనాలు.

—ఎ. వి. ఆర్. సూర్యకాంతం (సీని—బీహార్) ★